# పురుష హృదయం

అవన్నీ జ్ఞాపకం వచ్చి, సత్యానందానికి హృదయం బరువెక్కిపోయింది. ఇంతజరిగీ తనకి పిచ్చెత్తలేదేమో అని ఆలోచించాడు. తోచలేదు. ఒళ్ళు విరుచుకుని లేచి నుంచున్నాడు. నిలువుటద్దంలో మొహం కనిపించింది. తనమీద తనకే ఏకాకు వేసింది.

ఏదో చెయ్యవలసింది ఉండిపోయింది.

ఏమిటో—

తెలియడంలేదు,

గోడల్నీ

కేలండర్లనీ చూస్తున్నాడు.

కేలండరులో

నువ్వుతున్న సినిమాతార కనిపించింది.

ఆ బొమ్మ చూసేసరికి చెయ్యవలసింది జ్ఞాపకం వచ్చినట్టయింది. పెనిసిలు పుచ్చుకొని గోడమీద రాశాడు.

"ఆడవాళ్ళంతా చచ్చిపోవాలి"

"హా య్"

తేలిగ్గా అపులించాడు. గడియారం మూడని చెబుతోంది, ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో పోసుకుని తాగి కళ్ళు మూసుకు ఆనందిస్తున్నాడు. కానీ గ్లాసు టేబిల్ మీద పెట్టి సిగరెట్టు ముట్టించాడు. పొగ కెరటాలు, కెరటాలుగా గాలిలో లీనమవుతోంది. ఈ మాటు చాలా తాపీగా కాయితం మీద రాశాడు.

"ఆడవాళ్ళకి మనసులేదు"

ఇప్పటికి గుండెలమీద మంచి బరువు దించినట్టయింది. కుర్చీలో వెనక్కి కూచోపడేసరికి కేలండరుమీద హఠాత్తుగా నిద్ర మేల్కొన్నవాడిలాగ "ఆడవాళ్ళకి సిగ్గులేదు" అని రాశాడు.

ఈ వాక్యం అతని కన్నిటికంటె తృప్తినిచ్చింది. మానవుడి మనస్తత్వమే అంత. తాను అనుకున్నది నిజమేనా అని ఒకోసారి అనుమానం వచ్చినప్పుడు, ఎవరయినా చెబితే వినాలనిపిస్తుంది. ఎవరూ లేరు కనుక సత్యానందం ఆ వాక్యం కాయితంమీద రాసుకొని ధైర్యం తెచ్చుకున్నాడు.

లేచి తువ్వాలు కేలండరు మేకుకి చుట్టాడు. అతనిప్పుడు శత్రువుల్ని

జయించినంత సంతోషించాడు. పాట పాడుదామనుకున్నాడు. నెమ్మదిగా కూని రాగం ప్రారంభిస్తుంటే దూరాన్నుంచి సినిమా రికార్డు వినిపించింది.

"ఈ చల్లని వెన్నెలరేయీ
నా మనసును దోచితివోయీ
నా రాజ
నా సొగసులు నీ కొరకేలే"

సత్యానందానికి ఆనందం ముంచుకొచ్చింది.

ఆడవాళ్ళకి మనసు లేదు. ఇది ఎండలాంటి నిజమనుకున్నాడు. వాళ్ళకి మగాళ్ళని నమిలి మింగడం తప్ప మరొక పనిలేదని తీర్మానించుకున్నాడు. స్త్రీ ఎప్పుడూ మగాణ్ణి వలలో వేసుకుందికే చూస్తుంది. ఆలోచిస్తున్నాడు. సరిగ్గా అదే జరిగింది. తన విషయంలోనూ—

ఏడాది క్రితం నాటి మాట. తనకి కృష్ణవేణితో పరిచయమయ్యింది. కృష్ణ వేణిని సత్యానందం మొదటిసారి చూసినప్పుడు "ఈ అమ్మాయి అందంగా ఉంటుంది" అనుకున్నాడు.

రెండోసారి చూసి "చూసిన కొద్దీ చూడాలనిపిస్తోంది. ఈ అమ్మాయిలో చిత్రమేమిటో" అనుకుని స్వగతం చెప్పుకున్నాడు.

మూడోసారి "ఈ అమ్మాయిని చూస్తుంటే గుండెల్లోంచి ఈ సంగీతమేమిటి? అది ఇదేదైనా జబ్బేమోనని" అనుమానించాడు.

నాలుగోసారి తలంటిపోసుకున్న కృష్ణవేణిని చూసి "ఎంత బావుందో బంతి పువ్వులాగ—ముద్దుపెట్టుకుంటే బావుణ్ణు" అనుకున్నాడు

అయిదోసారి ముద్దుపెట్టుకునే అవకాశం వచ్చింది. కాని ముద్దుపెట్టుకోలేదు ధైర్యం చాలిందికాదు.

ఆరోసారి ముద్దుపెట్టుకున్నాడు. అలా అనేకంటే కృష్ణవేణి అతన్ని ముద్దు పెట్టుకోనిచ్చింది. అనడం సమంజసం.

సత్యానందం ఆశ్చర్యానికి అంతులేదు. తను నిజంగా ముద్దు పెట్టు కున్నాడా అని అనుమానం వేసింది. ఎదురుగా నవ్వుతూ కనిపించిన కృష్ణవేణిని చూసి ఇది నిజమేనని నిర్ధారణ చేసుకున్నాడు.

ఇట్లా సత్యానందం కృష్ణవేణిల మధ్య అనురాగం క్షణ క్షణ ప్రవర్ధమాన మయింది. పెరిగి పెరిగి అది ఉచ్ఛస్థితిని చేరుకుంది.

అలా ఉచ్ఛస్థితిని అందుకున్న నాటిరోజున ఇద్దరూ సినిమాకి వెళ్ళారు. ఆ రోజు కృష్ణవేణికి సత్యానందం రాజాధిరాజులా కనిపించాడు. సినిమాలో ఆమె

భుజంమీద చెయ్యివేశాడు. నవ్వుతూ మృదువుగా తోసేసింది. సత్యానందం చేత్తో పాటు పయిటకూడా జారింది. సత్యానందానికి కళ్ళల్లో ఏవో గుచ్చుకున్నట్టయింది కృష్ణవేణి చటుకున్న పయిట సర్దుకుని తప్పుకాదా అన్నట్టు చురుక్కున చూసింది సత్యానందానికి ఆనందం బరువుగా వుంటుంది గావు ననిపించింది. సినిమా అయిపోయాక ఇళ్ళకి వెళ్ళిపోయేటప్పుడు కృష్ణవేణి సత్యానందాన్ని ముద్దుపెట్టుకొని "టాటా" చెప్పింది. అతనికారాత్రి నిద్రపట్టలేదు. చెదురుమదురుగా పట్టిన నిద్రలో కలలు.

ఆ మర్నాడే ఘోరం జరిగింది.

కృష్ణవేణి "మా నాన్న నాకు పెళ్ళి నిశ్చయించారు" అని చెప్పింది. అతను "అలాంటి బుద్ధితక్కువ పేలాపన పేలకు" అన్నట్లు గుడ్లెర్ర చేశాడు.

"ఎప్పుడూ—" అన్నాడు హేళనగా సాగలుదీస్తూ.

"ఇవ్వాల్టికి సరిగ్గా ఇర్వయ్ నాలుగు రోజులు" అన్నది.

కంఠస్వరం సన్నంగా వుంది. ముద్దుగా ఉంది.

ముద్దుగా ఉంది. ముద్దు ముద్దుగా వుంది.

''నాకు పెళ్ళి నిశ్చయమయిపోయింది. నీకుతెలుసో తెలీదోకాని'' అన్నాడు సత్యానందం.

''ఎప్పుడూ'' అన్నది.

''ఇవాల్టికి సరిగ్గా ఇవ్వయ్ నాలుగు రోజులు'' అన్నాడు. భుజం మీద తల ఆనించి. అట్లా అన్నప్పుడు ఆమె పెదవులు అందంగాకదిలినయ్ నోరూరిస్తున్నాయి.

''వధువు ఎవరో తెలుసా?'' అన్నాడు. ఆకాశంలోకి చూస్తూ.

''నా కృష్ణవేణి'' అన్నాడు.

అతను ఆనందంగా వున్నాడు. అతని మనస్సలా అనడంలో బాలాఆనంద పడుతోంది. సత్యానందం కళ్ళు మరీ వెలుగ్గా ఉన్నాయి.

ఆమె గల గలా కిల కిలా నవ్వింది.

సత్యానందం మొట్టికాయ మొట్టాడు. సత్యానందం మనసులో ప్రేమ పరవళ్ళు తొక్కుతోంది. ఆమె నవ్వాపుచేసుకుని—''నవ్వుతాలు కాదు. నిజంగానే మా నాన్న పెళ్ళిచేసేస్తాడంది''ఈ సారి సీరియస్‌గాఅన్నది. ఆ కళ్ళల్లో ఆందోళన.

సత్యానందానికి భయం వేసింది, ఆమె కళ్ళల్లో నీళ్ళు చూసి నక్షత్రాలు రాలిపోయాయేమో అనుకున్నాడు. ఆమె లేత పెదవులు ఒణకడం చూసి సత్యానందం ప్రాణం గిలగిల్లాడింది. ఆమెను దగ్గిరికి అదుముకొన్నాడు.

'అలా జరుగదు.'

మనం ఎక్కడికయినా వెళ్ళిపోదాం.

ఆ మాట విని సత్యానందం ఒంట్లో విద్యుత్ ప్రవహించినట్టయింది. కోటి సూర్యులు ఒక్కసారి వెలిగినట్టు గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. ఆమెను ఇంకా ఇంకా దగ్గిరికి అదుముకున్నాడు.

ఆమెకు తాను లేనేమో ననిపించింది.

ఆమె తల ఇంకా అతని రొమ్ము మీదనే ఉన్నట్టనిపించింది. సిగరెట్టు కాలి పోయి వేలి కొస చురుక్కుమన్నది. లేచి కిటికీలోంచి బయట పారేసి సబ్బుతో మొహం కడుక్కున్నాడు. వాచీలో చిన్న ముల్లు అరునంటుకుంటోంది. బట్టలు వేసు కుని బయలుదేరాడు. రోడ్డు మీద అనేక మందిలో ఒకడయ్, అనేకమందివలెనే.

"అలా జరుగదు" అని తనన్నాడేగాని అలాగే జరిగింది. ఎందుకలా జరి గింది? అనెవరయినా ప్రశ్న వెయ్యొచ్చు. ఇది సంఘం-పైగా పవిత్ర భారతదేశం

అయినా కృష్ణవేణి అలాచేస్తుందని సత్యానందం ఊహించుకోలేక పోయాడు మాటవరసకయినా. తనని మోసం చేసింది. తనతో ఈ పెళ్ళి ఇష్టంలేదనిచెప్పింది. జరగనివ్వనంది. నిన్ను వదలను నమ్మమంది. ఇది సత్యం నిత్యం అన్నది. నువ్వు లేకపోతే నా ప్రాణమే లేదంది. ఇన్నీ అని ఆఖరిరోజున ఉత్తరం రాసిపంపింది.

"ఈ పెళ్ళి ఆగేట్టులేదు క్షమించు."

ఉగ్రుడయ్ జుట్టు పీక్కుని బయలుదేరాడు. ఏ కారయినా తనమీంచి వెళ్లి పోతే బావుణ్ణని అడ్డదిడ్డంగా నడవడం ప్రారంభించాడు. ఒక చోట అతను కారు కింద పడిపోవలసిందే. కాని సరిగ్గా ఆ కారు అక్కడికొచ్చి ఆగిపోయింది. వెళ్లి 'కృష్ణవేణి ఉందా?' అనడిగాడు, పనిపిల్లను రహస్యంగా పిలిచి. లోపల పెళ్లికూ తురు ముస్తాబులో వున్నదని తెలిసి ఆ మేడ తిరగబడిపోకూడదా? అనుకున్నాడు

మొగాడు-ఆడదాన్ని ఎదిరించేటంత ధైర్యవంతుడుకాదు. ఆమె ఒదిగినన్నాళ్లు అధికారం చెలాయించటం తప్ప చాత కాదు. సత్యానందం కూడా ఆ బలహీనతకు లొంగి నలిగిపోయాడు. అతనిదీ ఒక పురుష హృదయమే, ఎంత లేదన్నా.

సత్యానందం కాళ్ళు గంటస్తంభంచుట్టి న్యూ పూర్ణా ముందాగాయి. కొంచెం సేపటికతను ఒక కుర్చీలో కూర్చొని-నేనిక్కడికి ఎట్లా వచ్చాననుకున్నాడు. ఏముంది ఏదో ఆలోచిస్తూ వచ్చేసి ఉంటాడు.

'ఆట' ఇంకా ప్రారంభం కాలేదు. కుమారిలు, శ్రీమతీ సమేతులూ, బ్రహ్మ చారులూ-రక రకాలవాళ్ళు వస్తున్నారు.

"ఆడదాని ఓరచూపుకూ

జగాన వోడిపోని వీరుడెవ్వడూ"

నోర్మూయ్–అందామనుకున్నాడు. గాని అది సినిమా రికార్డని గేపకం వచ్చి తమాయించుకున్నాడు. 'ఆట' ఇంకా మొదలుపెట్టలేదు. ఒక కిళ్ళీ కొనుక్కుని కటిక్కన కసిగా కొరికి, నమిలేశాడు. సిగిరెట్టు ముట్టించాడు.

కాసేపటికి సినిమా చూస్తున్నాడు. తెరమీద బొమ్మలు మారుతున్నాయి. హీరో ఏం బాగులేడు. వాడికోయాభయ్యేన్నా ఉంటాయి. పాపం హీరోయిన్ మొన్న మొన్న పచ్చిఉంటుంది. ఇరవయ్యో పాతికో ఉంటాయి. [సినీ పరిభాషలోన యితే టినేజీ] ఆ అమ్మాయి హీరో పక్కన కూచోవడం–నిలబడ్డం–మాటాడ్డం—పాడ్డం–ఏం నచ్చలేదు. ఒకచోట హీరోయిన్‌ని కావలించుకుంటుంటే "ఛీ పాడు వెధవ అదేం పని–పాపం పసిపిల్లని చేసి" అనుకున్నాడు. ఆ హీరోయిన్ చాలా బావుంది. లోకట్ షేప్ జాకెట్టు–దానికితోడు పయిట పూర్తిగా వేసుకున్నా బావుణ్ణు సగం సగం పైటచుట్టుకొని మొహమాటపడిపోయి ఇబ్బందిపడిపోతున్నాడు

"ఆడ వాళ్ళకి సిగ్గులేదు" అనుకున్నాడు.

కృష్ణవేణిపాపంఅలాంటిదికాదు.కృష్ణవేణి ఎప్పుడైనా ఇలాంటి డ్రెస్‌వేసిందా? అలా లోకట్ షేప్ జాకెట్లుతో, కృష్ణవేణిని ఒక్కసారి చూస్తే బావుణ్ణు.

అంతలో కృష్ణవేణి–ఈ క్షణంలో మరొకడి సమక్షంలో ఉంటుందని జ్ఞాపకం వచ్చేసరికి–గొల్లున ఏడుద్దామనిపించింది.

"ఆడవాళ్ళు కూౄరులు" అనుకున్నాడు. సత్యానందం "నన్ను కృష్ణవేణి అన్యాయం చేసింది" అనుకున్నాడు. తెరమీద కనిపించే హీరోయిన్ కృష్ణవేణిలా మారిపోయి "నువ్వు పిరికివాడివి నిన్ను నమ్ముకున్న ఆడదాన్ని రక్షించుకోలేని నువ్వు ఒక మొగాడివేనా?" అన్నట్టు వినిపించి ఉలిక్కిపడ్డాడు.

సత్యానందం కుర్చీలోంచి సగంలో లేచిపోయి బయటకి వచ్చాడు. 'ఆట' ఇంకా పావుగంట వుండవచ్చు. సరాసరి రూమ్‌కి వెళ్ళి తలుపు తెరిచి ఒక కాగితం మీద కృష్ణవేణి అని రాసి చింపేసి, నమిలేసి, వూసేసి కూజాలో చల్లని మంచినీళ్లు కాసిని తాగాడు. ఒకప్పుడట్లా రాసినకాగితాలు, రొమ్ముమీద అంటించుకుని పలవరించిన విషయం అతనికిప్పుడు జ్ఞాపకంలేదు. జ్ఞాపకం వచ్చినా బలవంతంగా మరిచిపోతాడు కూడాను

అద్దంలో చూసుకుంటే–అందంగా మీసం కనిపించింది. "నేనూ మగవాణ్ణే —హుఁ" అనుకుని మీసంమీద చెయ్యి వేసుకున్నాడు. ఒకసారి ఆ మీసాన్ని

కృష్ణవేణి పొగడటం జ్ఞాపకం వచ్చింది సన్నగా పొడుగ్గా, సున్నితంగా, మృదువుగా ఉన్న వేళ్ళతో ఆ మీసాన్ని తడిమింది. కాసేపు రెప్పవాల్చకుండా అట్లా చూసింది.

అవన్నీ తలచుకుంటే మనసు వేడెక్కుతుంది. సత్యానందం మనసు బండబారిపోయింది. లైటార్పేసి పడుకున్నాడు. మగత నిద్రలో తాను ఆడదాన్న యిపోయినట్టు కల గని ఇంచుమించు కెవ్వుమని కేకపెడుతూలేచాడు. తొరతొరగా అద్దంముందు కెళ్ళి నుంచున్నాడు. మొదటిసారిగా తన కళ్ళు తనమీసాన్ని చూసి నయ్. క్రాపూ, చొక్కా, పయిజమా, తను మొగవాడే. చాలాసేపు అట్లానే నుంచుండిపోయాడు.

కాసేపటికి ఆవలింతలొచ్చాయి. పక్కమీద ఒరిగాడు. కానీ నిద్ర పట్టలేదు లేచి చాలాసేపు అట్లానే నుంచుండిపోయాడు. చాలాసేపు గింజుకుని, గింజుకుని మంచంమీద ఒరిగిరెప్ప మూశాడు.

అతని పురుష హృదయం బరువుగా మూల్గింది.

రచన : 1963 శీతాకాలం ప్రచురణ : పుస్తక ప్రపంచం, మే 1966